## క్లుప్తంగా

### కరాటేలో నగరి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో కరాటే నిర్వాహకులు, మాస్టర్లు

**నగరి :** తమిళనాడు తిరుత్తణిలో జరిగిన కరాటే పోటీల్లో నగరి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జపాన్‌షిటోరాయ్ కరాటే స్కూల్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు తిరుత్తణిలో జరిగిన కరాటే పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో ఏ.కార్తికేయన్, మోహనవేలు, మోహిత్ ఆరెంజ్ బెల్టు, గీతిక, విశ్వ ఎల్లో బెల్టు దక్కించుకున్నారు. ప్రతిభ చూపిన విద్యా ర్థులకు నిర్వాహకులు షీల్డ్, కప్పులు అందించారు. కరాటేమాస్టర్ అన్నాదొర్రై, ఇతర కరాటే శిక్షకులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి

**పుత్తూరు రూరల్:** ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కోరారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవనంలో తిరుపతి జిల్లా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి భద్రత కల్పించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుమార్‌రెడ్డి, రాధాకృష్ణ, గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### రుణాలను సకాలంలో వసూలు చేయాలి



మాట్లాడుతున్న ఏజీఎం ప్రకాష్

**పాలసముద్రం :** స్త్రీనిధి రుణాలను సకాలంలో వసూలు చేయాలని ఏజీఎం ప్రకాష్ తెలిపారు. మంగళవారం ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా సంఘాల సభ్యులు, సీసీ, సంఘ మిత్రాలకు ఏపీఎం పరిద్ మస్తాన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఏజీఎం మాట్లాడుతూ స్త్రీనిధి రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. స్త్రీనిధి సంస్థకు పూర్తి స్థాయి యజమానులు డ్వాక్రా మహిళలేనని పేర్కొన్నారు. బ్యాంకు లింకేజీల ద్వారా అందిస్తున్న వడ్డీలేని రుణాలను సభ్యులు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు.

### వైఎస్సార్ బీమా అందజేత

**పుత్తూరు రూరల్:** పుత్తూరు మండలం కేబీఆర్ పురం ఆదిఆంధ్రవాడకు చెందిన ఎం.శివయ్య(40) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా మొత్తం నుంచి తక్షణ సాయంగా రూ.10 వేలు ఎంపీడీఓ ఇందిర అందజేశారు. ఆమె మాట్లాడుతూ దహన క్రియలకు తక్షణ సాయంగా పదివేలు అందజేశామని, మిగిలిన రూ.90 వేలు డెత్ సర్టిఫికెట్ అందజేయగానే బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని పేర్కొన్నారు. అలాగే బాధిత కుటుంబానికి కేబీఆర్ పురం గ్రామానికి చెందిన 'కదిలించే హృదయాలు' సంస్థ సైతం సాయం అం దించింది. రాష్ట్ర యాదవ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నాలోక నాథం చేతుల మీదుగా నగదుతో పాటు బియ్యం అందజేశారు.

### పౌష్టికాహారం తప్పనిసరి



మాట్లాడుతున్న వైద్యాధికారి బాలసుబ్రమణ్యంరెడ్డి

**శ్రీరంగరాజపురం :** గర్భిణులు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని మండల వైద్యాధికారి బాలసుబ్రమణ్యం రెడ్డి అన్నారు. మంగళవారం వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులతో ఆయన మాట్లాడుతూ పాలు, కోడిగుడ్లు, చిక్కీలు, రాగి, గోధుమ, ఎండు ఖర్జురం తదితరాలను తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహారంతో వ్యాధి నిరోధకశక్తితోపాటు పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే నెలవాయి సచివాలయ పరిధిలో వైద్యాధికారి పల్లవి ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

### వైద్య సేవల పరిశీలన

**చిత్తూరు రూరల్:** చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని మంగళవారం ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్ సందర్శించారు. డీఎంఅండ్‌హెచ్ ఓజీ.ప్రకాశంతో శాఖాపరమైన సేవలు, విధుల అంశాలను తెలుసుకున్నారు. విభాగాల వారీగా పనిచేసే అధికారులు, సిబ్బంది, పీహెచ్‌సీల పనితీరు, మందులు, మాత్రల నిల్వలపై పూర్తి స్థాయిలో సమీక్షించారు.

### పెండింగ్ జీతాలు చెల్లించాలి

**చిత్తూరు కార్పొరేషన్:** పెండింగ్ జీతాలు ఇవ్వాలని గ్రీన్ అంబాసిడర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాములు కోరారు. ఈమేరకు మంగళవారం డీపీఆర్సీ కార్యాలయంలో డీసీ షణ్ముగంకు వినతి పత్రం అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా ఆరోగ్యాన్ని కాపాడుతున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. నాయకులు నాగరాజన్ పాల్గొన్నారు.

# ముందే వచ్చిన సంక్రాంతి..



నగరి : వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

**నగరి :** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మంగళవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ వస్త్రధారణతో సంస్కృతి ప్రతిబింబించేలా హాజరయ్యారు. కళాశాల ఆవరణలో పొంగళ్లు పెట్టారు. గొబ్బితట్టారు. ప్రిన్సిపల్ వేణుగోపాల్ మాట్లాడుతూ తెలుగువారి పండుగల్లో మకర సంక్రాంతికి ఎంతో ప్రాధాన్యం ఉందని తెలిపారు. పండుగలు ప్రజల్లో సంతోషాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భోగి పండుగను పర్యావరణానికి హాని కలుగని రీతిలో జరుపుకోవాలన్నారు. కళాశాల ఐక్యూ కోఆర్డినేటర్ మురళీమోహన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ గోపి, అధ్యాపకులు వేణుగోపాల్, జ్యోతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

**పుత్తూరు రూరల్:** పుత్తూరు ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు జరిగాయి. సంప్రదాయ దుస్తులతో విచ్చేసిన విద్యార్థులు, అధ్యాపకులతో కళాశాల ఆవరణ కోలాహలంగా మారింది. మామిడి తోరణాలు, అరటి చెట్లతో కళాశాల ఆవరణను అలంకరించి పండుగ వాతావరణాన్ని నింపారు. విద్యార్థినులు రంగవల్లులు తీర్చిదిద్దారు. పాటలు పాడుతూ గొబ్బి తట్టారు. అనంతరం భోగి మంట వేసి, కలిశపూజతో సంక్రాంతి పండుగను ఆవిష్కరింపజేశారు. ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ తెలుగువారు సంప్రదాయంగా జరుపుకునే తొలి పెద్దపండుగ సంక్రాంతి అని తెలిపారు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశిస్తాడు కాబట్టి మకర సంక్రాంతిగా పిలుస్తారని వివరించారు. భోగి, సంక్రాంతి, కనుమ పేర్లతో మూడు రోజుల పాటు తెలుగు లోగిళ్లలో పండుగ వాతావరణం తొణికిసలాడుతుందని తెలిపారు. భోగి పండుగను కాలుష్యరహితంగా జరుపుకునేలా విద్యార్థులు అవగాహన కల్పించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్స్ కోటేశ్వరయ్య, వీరయ్య, స్త్రీ సాధికార కమిటీ కన్వీనర్స్ శ్రీదేవి, నరసింహులు పాల్గొన్నారు.



పుత్తూరు : గొబ్బి తడుతున్న విద్యార్థినులు



పుత్తూరు : భోగి విశిష్టతను వివరిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

**నగరి :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలకు వశిష్ఠ విద్యాలయ విద్యార్థులు కేసీ తేజేష్, భానుప్రకాష్ ఎంపికయినట్లు విద్యాలయ కరస్పాండెంట్ రాజరాజేశ్వరి, హెచ్‌ఎం జయచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించింది. పీఈటీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 20, 21, 22 తేదీల్లో మదనపల్లె జెడ్పీ హైస్కూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

## భ్రూణ హత్యలు నేరం



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

**గంగాధరనెల్లూరు:** భ్రూణ హత్యలు చట్ట రీత్యా నేరమని తూగుండ్రం వైద్యాధికారి దివ్య హెచ్చరించారు. మం డలంలోని ఎస్‌ఎస్‌కొండ గ్రామంలో మంగళవారం లింగ వివక్ష నిర్మూలన, నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదని తెలిపారు. ప్రభుత్వం అనుమతించిన స్కానింగ్ కేంద్రాల్లో మాత్రమే జన్యుపరమైన సమస్యలు, క్రోమోజోములసంఖ్య తెలుసుకునేందుకు, బిడ్డ ఎదుగుదల కోసం, ఆరోగ్యస్థితి తెలుసుకునేందుకు మాత్రమే స్కానింగ్ చేయాలని పేర్కొన్నారు. ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే రూ.10 వేల జరిమానాతో పాటు మూడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తారని తెలిపారు.

## ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



విజేత విద్యార్థులతో రాయల సీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి

**పుత్తూరు రూరల్:** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని సాధించినప్పుడే తల్లిదండ్రుల కలలు సాకారమైనట్లని రాయల సీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రముఖ సినీ దర్శకుడు ఆర్కే సెల్వమణి పేర్కొన్నారు. పుత్తూరు మండలం పరమేశ్వరమంగళంలోని కేకేసీ హోమియో కళాశాలలో మంగళవారం హోమియో అన్వేషణ(ఎక్స్‌ప్లోరికా)–2కే 2023 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల ఫస్ట్ ర్యాంకు సాధించిన విద్యార్థి సైతం స్టేజీపై రెండు నిమిషాల పాటు మాట్లాడలేక పోతున్నారని చెప్పారు. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకున్నప్పుడే ఏరంగంలోనైనా రాణించగలుగుతారని తెలిపారు. కోవిడ్ సమయంలో కేకేసీ కళాశాలలో వంద పడకలతో సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి అనుమతివ్వడంతో పాటు పూర్తి సహాయ సహకారాలు అందించిన యాజమాన్యం సేవలను కొనియాడారు. మూడు రోజుల పాటు నిర్వహించిన వివిధ క్రీడాపోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కేకేసీ విద్యా సంస్థల చైర్మన్ కె.కుప్పయ్యశెట్టి, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఎం.సురేష్, పద్మజ, వైస్ చైర్మన్స్ కె.నరసింహారావు, మంజుల, కె.రవిశేఖర్, వైష్ణవి, ప్రిన్సిపల్ డాక్టర్ జి.శరవణ పాల్గొన్నారు.

## ఊరెళుతున్నారా.. సమాచారం ఇవ్వండి



లక్ష్మీనారాయణ,సీఐ

**పుత్తూరు రూరల్:** సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఇళ్లకు తాళాలు వేసి వేరే ఊర్లకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం అందించాలని సీఐ లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. ఇటీవల పుత్తూరు పరిసర ప్రాంతాల్లో తాళాలు వేసిన ఇళ్లను ఎంచుకొని దొంగతనాలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో ఇంటి యజమానులు సైతం జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఊర్లకు వెళ్లే వారు ఇళ్లలో నగలు, నగదు, విలువైన వస్తువులను ఉంచకుండా జాగ్రత్త పడాలని సూచించారు. పరిసర ప్రాంతాల్లో అనుమానస్పద వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ముందస్తుగా పోలీసులకు సమాచారం అందిస్తే ఉచితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, మానటరింగ్ చేస్తామని పేర్కొన్నారు. సమాచారాన్ని 9440796727, 9440796728, 94413 30866, ల్యాండ్ నంబర్ 08577–262333కు ఫోన్ చేసి చెప్పాలని తెలిపారు.

### ఉపాధిని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీపీ మునివేలు

**పుత్తూరు రూరల్:** మండల పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మునివేలు తెలిపారు. మంగళవారం వేపగుంట గ్రామ సచివాలయంలో ఉపాధి హామీపై గ్రామ సభ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ పనుల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. రైతులకు ఉపయోగ పడే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. నూతన ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని ఎంపీపీని సచివాలయ సిబ్బంది సత్కరించారు. సర్పంచ్ గిరిజాప్రసాద్, ఏపీఓ భార్గవి, కార్యదర్శి నాగమణి, కన్వీనర్లు నరసింహులు, పుష్ప, ఫీల్డ్ అసిస్టెంట్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

### పంచాయతీల ఆదాయం పెంచుకోవాలి



**పాలసముద్రం :** సంపద కేంద్రాలతో పంచాయతీలు ఆదాయం పెంచుకోవాలని మండల విస్తరణాధికారి రమేష్ తెలిపారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సర్పంచ్ గాలి మహేష్ బాబుతో కలసి ఆయన పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్లు తడి, పొడి చెత్తను వేర్వేరుగా తరలించాలని తెలిపారు. సంపద కేంద్రాల్లో చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేసి విక్రయించాలని, తద్వారా ఆదాయం పెంచుకోవాలని తెలిపారు.

### పిచ్చి మొక్కల తొలగింపు



**నింద్ర:** మండలంలోని కొప్పేడు, వేదాంతపురం తదితర గ్రామాల్లో రోడ్డుకు ఇరు వైపుల ఏపుగా పెరిగి ఉన్న పిచ్చి మొక్కలను సర్పంచ్ సంపూర్ణ ఆధ్వర్యంలో మంగళవారం తొలగించారు. సర్పంచ్ మాట్లాడుతూ పరిసరాల శుభ్రత అందరి బాధ్యతని తెలిపారు.

### బాలగురునాథీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

**పాలసముద్రం :** మండలంలోని రాచపాళ్యంలో వెలసిన శ్రీబాల గురునాథీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామస్తులు మంగళ వాయిద్యాల నడుమ సారెను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకు వచ్చారు. అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక దీపారాధన, పూజలు చేశారు. మహిళలు పిండిదీపాలు వెలిగించారు.

### రెండు తలల దూడ జననం



రెండు తలల దూడ

**వెదురుకుప్పం :** మండలంలోని దిగువపల్లాలు పంచాయతీ ఇరగమరెడ్డి ఇండ్లు గ్రామంలో ఏకాంబరరెడ్డికి చెందిన పాడి ఆవు రెండు తలల దూడను ఈనింది. ఈనిన వెంటనే దూడ చనిపోయింది తెలిపారు. గ్రామస్తులు దీన్ని వింతగా తిలకించారు.

### డ్రోన్‌తో సస్యరక్షణపై శిక్షణ



క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

**నింద్ర:** మండలంలోని అగరం పేట, అత్తూరు, మంగళగిరి కండ్రిగ గ్రామాల్లో మంగళవారం పంటల సస్యరక్షణకు డ్రోన్ సహాయంతో ఎరువులు, పురుగు మందుల పిచికారీపై తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వారు రైతులకు శిక్షణ ఇచ్చారు. సస్య రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శాస్త్రవేత్తలు, శ్రీనివాసులు, దివ్య, రామ్‌కుమార్, అనూష తదితరులు పాల్గొన్నారు.

## ర్యాగింగ్ చేయం.. ప్రోత్సహించం..!





ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్పీ రామరాజు

**కార్వేటినగరం:** విద్యార్థులు ర్యాగింగ్ దూరంగా ఉండాలని, కేసులు నమోదైతే భవిష్యత్ అంధకారంగా మారుతుందని దిశ డీఎస్పీ రామరాజు తెలిపారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం యాంటీ ర్యాగింగ్ సెల్ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నివారణ, దిశ చట్టంపై అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే చట్ట పరంగా కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. కళాశాలలో స్నేహపూరిత వాతావరణం ఉండాలని సూచించారు. ర్యాగింగ్ కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్ నాశనమవుతుందని తెలిపారు. చట్టాలపై స్మార్ట్ బోర్డ్ ద్వారా అవగాహన కల్పించారు. దిశ మహిళా ఎస్ఐ గిరిజ మాట్లాడుతూ దిశా చట్టం ప్రయోజనాలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, రాగింగ్‌కు పాల్పడినా, ప్రోత్సాహించినా నేరమని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ర్యాగింగ్‌కు పాల్పడమని, ప్రోత్సహించమని ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ధనంజయరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మామిడిలో సస్యరక్షణకు సమయమిదే..



సూచనలిస్తున్న శాస్త్రవేత్త శ్రీనివాసులురెడ్డి

**వడమాలపేట :** మామిడితోటల్లో సస్యరక్షణకు రైతులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీనివాసులురెడ్డి అన్నారు. మంగళవారం అప్పలాయగుంటలో మామిడి రైతులకు సస్యరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతికి చెందిన చీని, నిమ్మ పరిశోధన శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ మామిడిలో పూత వచ్చే సమయం కాబట్టి రైతులు ఉద్యానవన అధికారులు సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలని తెలిపారు. ఉద్యానశాఖ అధికారి వెంకటసౌజన్య మాట్లాడుతూ పూత బాగా వచ్చేందుకు పొటాషియం నైట్రేట్ 10 గ్రాముల మందును లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే సూక్ష్మపోషకాలు 5 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పూత, కాయ, మంగు, తేనె మంగు పురుగు నివారణకు మోనోక్రోటోపాస్ 1.5 మిల్లీలీటర్లు, ఇమిడా క్లోప్రిడ్ 0.3 మిల్లీలీటర్లు. త్రోమేక్సన్ 0.3 మిల్లీలీటర్ల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ సూచించారు. మోనోక్రోటోపాస్, వేపనూనె 1.5 మిల్లీ మీటర్లు చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే మంచి ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. పండు ఈగ నివారణకు బుట్టలు ఎకరాకు 8 పెట్టాలని తెలిపారు. కాయం సింగిల్ విండో అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, జెడ్‌టీసీ మాజీ సభ్యుడు సురేష్‌కుమార్, అయ్యప్పరెడ్డి, నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

**నేడు మామిడి రైతుల సదస్సు**

**వెదురుకుప్పం:** మామిడి సస్య రక్షణ, జాగ్రత్తలపై బుధవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతులు హాజరై అధిక దిగుబడులు సాధించేందుకు అధికారులు, శాస్త్రవేత్తలు ఇచ్చే సూచనలు తెలుసుకోవాలన్నారు.

## శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న వెంకటరమణారెడ్డి, నాయకులు

**గంగాధరనెల్లూరు :** తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సీ వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మండలంలో మంగళవారం పార్టీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ పరిశీలకుడు వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో జీడీనెల్లూరు, వేల్కూరు, బుక్కాపట్నం సచివాలయ పరిధిలో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలసి కరపత్రాలను అందజేశారు. శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. శ్యాంప్రసాద్‌రెడ్డి అందుబాటులో ఉంటూ సేవలందిస్తారని తెలిపారు. వైస్ ఎంపీపీ హరిబాబు, మాజీ వైస్ ఎంపీపీ మునిరాజులు రెడ్డి, నాయకులు గోవిందరెడ్డి, పుష్పరాజ్, లారెన్స్ తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూ జెండా ఆవిష్కరణ



నగరి : జెండా ఆవిష్కరణలో నాయకులు

**నగరి :** మున్సిపల్ పరిధిలోని సత్రవాడలో మంగళవారం సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ నగరి మండల కార్యదర్శి ఏఎస్.పెరుమాళ్ మాట్లాడుతూ ఈనెల 18 నుంచి బెంగళూరులో సీఐటీయూ 17వ జాతీయ మహాసభలు జరుగనున్న సందర్భంగా జెండాను ఆవిష్కరించినట్లు తెలిపారు. 1970లో సీఐటీయూ ఏర్పడి ఉద్యోగ, కార్మిక, కర్షక సమస్యలపై అండగా నిలుస్తోందని తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చి కార్మికుల కడుపు కొట్టే చట్టాలను తీసుకు వస్తోందన్నారు. నాయకులు షణ్ముగం, జగదీష్, కందన్, గణపతి, సందీప్, నారాయణస్వామి, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

**పుత్తూరులో..**

**పుత్తూరు రూరల్:** పట్టణంలో మంగళవారం సీఐటీయూ జెండాను ఎగురవేశారు. జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తోందని ఆరోపించారు. మహాసభలకు ప్రతి కార్మికుడు హాజరు కావాలని కోరారు. నాయకులు యూసిఫ్‌బాషా, పురుషోత్తం, విజయ్, రమేష్, కందస్వామి పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి వ్రతం



ఆలయంలో సంకటహర చతుర్థి వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు

**కాణిపాకం(యాదమరి):** కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో మంగళవారం సంకటహర చతుర్థి వ్రతాన్ని ఆలయ అర్చక వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పౌర్ణమి తరువాత నాల్గవరోజు ఆలయంలో సంకటహర చతుర్థి వ్రతాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను అలంకార మండపంలో కొలువు దీర్చి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. ఉదయం 10 గంటలకు, సాయంత్రం 4 గంటలకు ఆలయంలో శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి వ్రతాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, బాబు పాల్గొన్నారు.

**స్వర్ణరథంలో విహరించిన గణనాథుడు**



గ్రామోత్సవంలో దేవదేవేరులు

సంకటహర చతర్థి వ్రతం సందర్భంగా వరసిద్ధి వినాయకస్వామి సిద్ధి, బుద్ధి సమేతంగా మంగళవారం రాత్రి స్వర్ణరథంలో ఆలయ మాడ వీధుల్లో విహరించారు. స్వర్ణరథంలో విహరిస్తున్న స్వామి వారిని దర్శించి భక్తులు తరించారు. భక్తులు కర్పూర మంగళ హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈఈ వెంకటనారాయణ, ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు, డీఎస్పీ శ్రీనివాసమూర్తి, వెస్ట్ సీఐ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.